# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 043
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
జనవరి 23, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




ఘనంగా జితిన్ ప్రకాష్ జన్మదిన వేడుకలు

2లో..



# వివాదాల్లో వరంగల్ బస్టాండ్

## కమీషన్ల కోసమే పనులు పెండింగ్

- మూడేళ్లుగా ముందుకు పడని అడుగులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, స్థానికులు
- పట్టించుకోని పాలకులు
- అధికారుల నిర్లక్ష్యంపై జనం ఆగ్రహం

వరంగల్ బస్టాండ్ నిర్మాణం అటకెక్కింది. కాంట్రాక్టర్లతో ఉన్న కమిషన్ల వివాదాలు, ఇతర సమస్యలతో పనులు ముందుకు సాగడం లేదు. వరంగల్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న పాత బస్టాండ్ ను 2023లోనే కూల్చి వేశారు. రూ.74.50కోట్ల కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ నిధులతో 32 ప్లాట్ ఫారమ్ లు, షాపింగ్ కాంప్లెక్స్, హోటళ్లు వంటి అత్యాధునిక సదుపాయాలతో స్మార్ట్ సిటీ మోడల్ బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. జనవరి 2026 లోగా కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలన్న నిబంధన ఉన్నప్పటికీ అడుగు ముందుకు పడడంలేదు. బస్టాండ్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో గుంతలు తవ్వడంతోపాటు చుట్టూ రేకులను అమర్చడంతో ఈ ప్రాంతం ఇరుకుగా మారి సమస్యలకు నిలయమైంది. ప్రయాణికులు, స్థానికులు, నిత్యం మార్కెట్ కు వచ్చే వారితో రద్దీగా మారుతోంది. ట్రాఫిక్ జామ్ లతో ఇబ్బందులు తప్పడంలేదు. అయితే పాలకుల నిర్లక్ష్యమే బస్టాండ్ జాప్యానికి కారణమని జనం దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి




వివరాలు2లో..



2లో..

## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులు

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ | టీయూడబ్ల్యూజే (ఐజేయూ) డైరీ ఆవిష్కరణ



## జనగామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర మంత్రి సీతక్క
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

8లో..

## మేడారం జాతరను విజయవంతం చేద్దాం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- పోలీస్, ఆర్టీసీ అధికారులతో సమీక్ష
- పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి




8లో..





# వివాదాల్లో వరంగల్ బస్టాండ్

- కమీషన్ల కోసమే పనులు పెండింగ్
- మూడేళ్లుగా ముందుకు పడని అడుగులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, స్థానికులు
- పట్టించుకోని పాలకులు
- అధికారుల నిర్లక్ష్యంపై జనం ఆగ్రహం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వరంగల్ నిలుస్తోంది. గడిచిన రెండేళ్లుగా ఇక్కడ ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అయితే.. ప్రతిష్టాత్మకమైన వరంగల్ ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థకు చెందిన రూ.74.50 కోట్ల వ్యయంతో స్మార్ట్ సిటీ పథకం కింద ఈ మోడల్ బస్టాండ్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అందుకు అనుగుణంగా అన్ని అనుమతులను పొందారు. అయినప్పటికీ పనులు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా పనులు ప్రాథమిక దశలోనే ఆగిపోవడం విమర్శలకు దారితీస్తోంది.

### రూ.74.50 కోట్లతో..

వరంగల్ రైల్వే స్టేషన్ ఎదురుగా నిర్మిస్తున్న స్మార్ట్ సిటీ మోడల్ బస్టాండ్ పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)తో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ పరస్పర ఒప్పందం చేసుకుంది. అత్యాధునిక వసతులతో నూతన బస్టాండ్ నిర్మాణానికి రూ.74.50 కోట్లతో ప్రతిపాదించారు. జి ప్లస్–2 భవన నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. గ్రౌండ్ ఫ్లోర్ లో వాహనాల పార్కింగ్, మొదటి, రెండో అంతస్థులు బస్టాండ్ కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. మొత్తం 32 ప్లాట్ ఫారమ్ లు, షాపింగ్ కాంప్లెక్స్, హోటళ్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 2023 సెప్టెంబర్ లో పనులకు శంకుస్థాపన చేశారు. 2024లో పనులు మొదలుపెట్టారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు.

### వివాదాలే కారణం..

పనులను అట్టహాసంగా ప్రారంభించిన ఆగుతూ.. సాగుతూ వచ్చాయి. గత సంవత్సర కాలంగా మొత్తానికే పనులను నిలిపివేశారు. అయితే దీని నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నా నిధుల కొరత, కాంట్రాక్టర్లతో వివాదాల వల్లే పనులు ఆగాయని ఆరోపణలు వస్తున్నాయి. కుడా వద్ద నిధులు లేకపోవడం.. ప్రభుత్వ బకాయిలు రాకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది.

### ఇబ్బందుల్లో ప్రయాణికులు..

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పక్కనే ఉన్న సిటిజన్ క్లబ్, రాంకీ రోడ్డు మూసివేసి ఆ ప్రాంతంలోనే తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేశారు. అయితే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కావాల్సినన్ని ప్లాట్ ఫారమ్ లు లేక పోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. దీనికి తోడు అరకొర వసతులు ప్రయాణికులకు మిట్ట మధ్యాహ్నమే చుక్కలు చూపిస్తున్నాయి. ప్లాట్ ఫారమ్ పై ఒక బస్ ఉందంటే రెండో బస్ దూరంగా ఆపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కనే ఉన్న కూరగాయ మార్కెట్, రైల్వే స్టేషన్ కు వచ్చే జనంతో ఈ ప్రాంతం రద్దీగా మారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ లు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు, కుడా అధికారులు స్పందించి వెంటనే వరంగల్ బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ఘనంగా జితిన్ ప్రకాష్ జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లోని జీఎస్కే ఫంక్షన్ హాల్‌లో సామల జితిన్ ప్రకాష్ మొదటి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు భారీ సంఖ్యలో హాజరై చిన్నారికి ఆశీస్సులు అందజేశారు. చిన్నారి తల్లిదండ్రులు సామల నిఖిల్ ప్రకాష్–సాయి లక్ష్మి, నానమ్మ తాతయ్యలు సామల మంజుల–సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో రంగురంగుల విద్యుత్ దీపాలు, అలంకరణల మధ్య వేడుక కంటికి పండువలా సాగింది. కేక్ కటింగ్ అనంతరం చిన్నారిని ఆశీర్వదించేందుకు వచ్చిన అతిథులకు విందు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులందరూ కలిసి జితిన్ ప్రకాష్‌తో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఈ వేడుకలో సామల కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొని చిన్నారి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



# కూరపాటి హాస్పిటల్స్‌లో .. ఘనంగా స్టాఫ్ జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని ప్రముఖ హస్పిటల్ కూరపాటి హాస్పిటల్స్ లో శుక్రవారం సందడి వాతావరణం నెలకొంది. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుప్రజ, ఐపీ మేనేజర్ నహేదల జన్మదిన వేడుకలను యాజమాన్యం మరియు సిబ్బంది ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. కూరపాటి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రమేష్ సతీమణి రాధిక, 'వరంగల్ వాయిస్' ఎడిటర్ గడ్డం కేశవ్ మూర్తి సమక్షంలో సుప్రజ, నహేదాలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధిలో వారిద్దరూ అందిస్తున్న సేవలను కొనియాడుతూ, వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప లెగిసెట్టి, నర్సింగ్ హోమ్ ప్రతినిధి రమ్యతో పాటు ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు అందజేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలు అందరిలో ఉత్సాహాన్ని నింపాయి.

# ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులు

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) డైరీ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలోనూ జర్నలిస్టులు కీలకమైన వారధిగా పనిచేస్తున్నారని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కొనియాడారు. శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా యూనిట్ రూపొందించిన 2026 నూతన సంవత్సర డైరీని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, అందులో జర్నలిస్టులు ముందువరుసలో ఉండటం అభినందనీయమని అన్నారు. జర్నలిస్టుల డైరీని ఆవిష్కరించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టు యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎల్లప్పుడూ అగ్రభాగంలో ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర హౌసింగ్ & వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వేణుమాధవ్, కంకనాల సంతోష్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి, జిల్లా కోశాధికారి బచ్చు పురుషోత్తం, ఉపాధ్యక్షులు ఉట్కూరి సాయిరాం, డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, ఎంఏ.నయీం, జిల్లా కార్యవర్గ సభ్యులు పులికంటి రాజేందర్, అల్లె రామారావు, వాజీద్, తాళ్ల రవి, ఖాదర్ పాషా, నాగరాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ విద్యార్థులే రేపటి ఐఐటీయన్లు

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- 'మిషన్ ఎక్స్‌లెన్స్' కోచింగ్ ప్రారంభం
- 80 మందికి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ కళాశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేలా జిల్లా యంత్రాంతం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రత్యేక చొరవతో రూపొందించిన జేఈఈ,ఐఐటీ,నీట్, ఎప్ సెట్ కోచింగ్ ప్రోగ్రామ్ – "మిషన్ ఎక్స్‌లెన్స్" శుక్రవారం మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఘనంగా ప్రారంభమైంది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో చదువుతున్న టాపర్లను ఎంపిక చేసి.. మొత్తం 80 మందికి (40 మంది బాలికలు, 40 మంది బాలురు) ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ శిబిరం 70 రోజుల పాటు కొనసాగుతుంది. ఇందులో అకడమిక్ బోధనతో పాటు క్రమం తప్పకుండా మోడల్ పరీక్షలు, డౌట్ క్లియరింగ్ సెషన్లు నిర్వహిస్తారు.ఎన్ఐటీ, కేఎంసీ ప్రొఫెసర్లతో పాటు జిల్లాలోని సీనియర్ అధ్యాపకులు విద్యార్థులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమం డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అజ్మీరా గోపాల్ ఆధ్వర్యంలో, మడికొండ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగింది. వర్ధన్నపేట ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మేడారం వెళ్లే బస్సులను రఘునాథపల్లిలో నిలపాలి

■ ఆర్టీసీ డీఎంకు వినతి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ప్రసిద్ధ కుంభమేళా మేడారం జాతర సందర్భంగా జనగామ డిపో నుంచి నడిపే స్పెషల్ బస్సులను రఘునాథపల్లి మండల కేంద్రంలో నిలపాలని కోరుతూ ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం)కు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, ఉప సర్పంచ్ ద్యావర యాకయ్యతో కలిసి నాయకులు జనగామలో డిపో మేనేజర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడారం వెళ్లే భక్తుల సౌకర్యార్థం జనగామ నుంచి వెళ్లే ప్రత్యేక బస్సులు రఘునాథపల్లి స్టేజీ వద్ద ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రఘునాథపల్లి మండల పరిసర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు జాతరకు వెళ్తారని, బస్సులు ఇక్కడ ఆగకపోతే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు డీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్‌కు వరంగల్ నగర బహిష్కరణ

◆ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సంచలన ఉత్తర్వులు



**వరంగల్ వాయిస్, క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, వరుస నేరాలకు పాల్పడుతున్న మిల్స్ కాలనీకి చెందిన రౌడీషీటర్ వంచనగిరి సురేష్ అలియాస్ కోతి సురేష్ (31)ను ఆరు నెలల పాటు కమిషనరేట్ పరిధి నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం–1348 ఫస్లీ (వరంగల్ మెట్రోపాలిటన్ ఏరియా పోలీస్ చట్టం, 2015) లోని సెక్షన్ 26(1) ప్రకారం వరంగల్ కమిషనరేట్‌లో ఈ తరహా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయడం ఇదే తొలిసారి. సురేష్‌పై గతంలో పలు తీవ్రమైన నేర కేసులు నమోదై ఉన్నాయి. అతని అక్రమ కార్యకలాపాల వల్ల ప్రజలు ఫిర్యాదు చేసేందుకు కూడా భయపడుతున్న తరుణంలో పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. నిందితుడి ప్రవర్తనపై వివరణ ఇవ్వాలని గతంలోనే నోటీసులు జారీ చేసినప్పటికీ, అతను అధికారుల ఎదుట హాజరుకాకపోవడమే కాకుండా ఎలాంటి వ్రాతపూర్వక వివరణ ఇవ్వలేదు. దీంతో అతని వల్ల ప్రజా శాంతికి ముప్పు ఉందని నిర్ధారించిన సీపీ, ఆరు నెలల పాటు నగరాన్ని విడిచి వెళ్లాలని ఆదేశించారు. కేవలం కోర్టు వాయిదాల కోసం మాత్రమే ముందస్తు అనుమతితో కమిషనరేట్ పరిధిలోకి రావాల్సి ఉంటుంది. సీపీ ఉత్తర్వుల అనంతరం మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్సై మిథున్ నిందితుడు కోతి సురేష్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దు వరకు తీసుకెళ్లి ఉత్తర్వుల కాపీని అందజేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తదుపరి చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సీపీ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపుతామని కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే భయపడకుండా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మేడారం భక్తులకు శుభవార్త

● 4 ప్రాంతాల నుంచి 80 ప్రత్యేక బస్సులు
● డీఎం ఇందు వెల్లడి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** దక్షిణ భారత కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ భూపాలపల్లి డిపో భారీ ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి, మొత్తం 80 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇందు వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భూపాలపల్లి: స్థానిక బస్ స్టేషన్ నుంచి, కాటారం: కాళేశ్వరం వెళ్లే మార్గంలోని బస్ స్టేషన్ ల్యాండ్ నుంచి, కాళేశ్వరం: కాళేశ్వరం బస్ స్టేషన్ నుంచి, సిరోంచా (మహారాష్ట్ర): బస్ స్టేషన్ పక్కన ఉన్న పార్కింగ్ ప్రదేశం నుంచి నేరుగా మేడారం గద్దెల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయి. భూపాలపల్లి క్యాంపు ఈ నెల 25 నుంచి 31 వరకు, మిగిలిన మూడు క్యాంపులు 26 నుంచి 31 వరకు కొనసాగుతాయని డీఎం తెలిపారు. భూపాలపల్లి – మేడారం పెద్దలకు రూ.230, పిల్లలకు రూ.140, కాటారం – మేడారం పెద్దలకు రూ.290, పిల్లలకు రూ. 180, కాళేశ్వరం – మేడారం పెద్దలకు 360, పిల్లలకు రూ. 210, సిరోంచా – మేడారం పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.230లుగ ఛార్జీల ధరలు ఉంటాయిని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ప్రత్యేక బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, మహిళలు తమ గుర్తింపు కార్డులు చూపి ఉచితంగా ప్రయాణించవచ్చని ఆమె స్పష్టం చేశారు. సొంత వాహనాల్లో వెళ్లి ఇబ్బందులు పడకుండా, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని భక్తులకు డీఎం ఇందు విజ్ఞప్తి చేశారు. ఈ సదావకాశాన్ని భూపాలపల్లి జిల్లా, సరిహద్దు ప్రాంతాల భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

■ బొల్లం అజయ్ పిలుపు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రానున్న స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ సత్తా చాటాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, జనగామ జిల్లా జడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు బొల్లం అజయ్ మణికంఠ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అజయ్ విమర్శించారు. అభివృద్ధి అనేది గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని, పైగా కాంగ్రెస్ నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా శనివారం అక్కడ భారీ పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో ఈ సమావేశం కొనసాగుతుందని ఆయన వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విభేదాలు పక్కన పెట్టి, సమిష్టిగా ముందుకు సాగాలని.. మున్సిపల్ పీఠంపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని అజయ్ మణికంఠ కోరారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో 'వరంగల్ వాయిస్' దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మండలంలోని గాయత్రి మెడికల్ స్టోర్ అధినేత డాక్టర్ నగేష్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నగేష్ రావు మాట్లాడుతూ.. 'వరంగల్ వాయిస్' పత్రిక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముందుంటుందని, నిష్పక్షపాత వార్తలతో ప్రజల మన్ననలు పొందుతోందని ప్రశంసించారు. 2026 నూతన సంవత్సరం అందరికీ శుభప్రదంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పరకాల 'వరంగల్ వాయిస్' రిపోర్టర్ బొజ్జం చొక్కారావు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరికలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఊరుగొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు పోలేపాక ఆంద్రయ్య, పోలేపాక సదయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో చల్లా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చల్లా ధర్మారెడ్డి ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు కాంగ్రెస్‌పై నమ్మకం కోల్పోతున్నారని, అందుకే ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆయన అన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం, గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ చేరికలతో ఊరుగొండ గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై నమ్మకంతో వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మీనారాయణ వ్యాస్ పేర్కొన్నారు. శుక్రవారం డోర్నకల్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు, యువత పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. వారికి లక్ష్మీనారాయణ వ్యాస్ కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రముఖ వ్యాపారవేత్త పండర్ నాథ్ లడ్డా, నరేష్ జైన్, నేతికొప్పుల సురేష్, నారాయణ అట్టల్, జానయ్య, అరుణ, షీలా శర్మ, రామ్మూర్తి, నాగరాజు, భాస్కర్ తో పాటు పలువురు పార్టీలో చేరారు. నరేంద్ర మోదీని 4వ సారి ప్రధానమంత్రిగా చూడాలని దేశ యువత బలంగా కోరుకుంటున్నారని లక్ష్మీనారాయణ వ్యాస్ అన్నారు. బీజేపీ సిద్ధాంతాలు, మోదీ ఆశయాలకు ఆకర్షితులై యువతీ యువకులు పార్టీ వైపు వస్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు అభివృద్ధి చెందాలంటే అది బీజేపీతోనే సాధ్యమన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను వార్డు కౌన్సిలర్లుగా గెలిపించి, పార్టీని బలోపేతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ దేవ, సీనియర్ నాయకులు నగేష్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రెహమాన్ పాల్గొన్నారు.

# నేతాజీ పోరాటం యువతకు స్ఫూర్తి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** భారత స్వతంత్ర సంగ్రామ యోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను సోమిడిలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ 62వ డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రావణ్ యాదవ్ మాట్లాడుతూ.. పరాయి పాలన నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు భారత సైనికులకు గెరిల్లా యుద్ధ విన్యాసాలు నేర్పించి, బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్రపోయిన ధీశాలి నేతాజీ అని కొనియాడారు. బీజేపీ నాయకులు సుంచు ప్రశాంత్, గిరి తిరుపతి, సంతోష్, గోపాల్, భరత్, ప్రభు కుమార్, యువజన సంఘ నాయకులు ఓంకార్, కరుణాకర్ రెడ్డి, పూర్ణచందర్, శ్రీనివాస్, రాహుల్, రాజు, అరుణ్ తదితరులు పాల్గొని నేతాజీకి నివాళులు అర్పించారు.

## కాకతీయ హైస్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, చిట్యాల :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి వేడుకలు చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ నేతాజీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈనాటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, ప్రతి విద్యార్థి నేతాజీని ఆదర్శంగా తీసుకొని దేశ సేవ చేయాలనే సంకల్పంతో ఉండాలని ఆయన సూచించారు. దేశం పట్ల భక్తిని, క్రమశిక్షణను అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నేతాజీకి నివాళులు అర్పించారు.

## గోవిందరాజుల గుట్ట వద్ద..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చని నమ్మి, దానిని ఆచరణలో పెట్టిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ కొనియాడారు. మాజీ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఆదేశాల మేరకు.. నేతాజీ జయంతిని పురస్కరించుకొని గోవిందరాజుల గుట్ట కింద ఉన్న నేతాజీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప దేశభక్తుడు నేతాజీ అని అన్నారు. ఆయన ఆశయాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు పోలేపాక విశాల్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సందెల లాజర్, మహమ్మద్ తైమూర్, పోలేపాక యాకూబ్, కొండమీద సదానందం, దౌడు నాగరాజ్, కంచర్ల వేణు, పోలేపాక శ్రవణ్, యాదగిరి, బొబ్బిలి అక్షయ్ తదితరులు పాల్గొని నేతాజీకి అంజలి ఘటించారు.

# దేశభక్తికి, శౌర్యానికి నిదర్శనం నేతాజీ

◆ ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తన అపూర్వ త్యాగంతో చరిత్ర సృష్టించిన మహానేత సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కరీమాబాద్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. సుభాష్ కమిటీ అధ్యక్షులు పూదరి అజయ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ చేసిన పోరాటం, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశభక్తి, శౌర్యం, నాయకత్వ లక్షణాలకు సుభాష్ చంద్రబోస్ ఒక నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుభాష్ కమిటీ ఉపాధ్యక్షులు




నాగపురి సంతోష్ గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శి మందా శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోమాకుల నాగరాజు, సీనియర్ నాయకులు మాచర్ల చిన్నారావు, కూచన క్రాంతి,బీజేవైఎం తూర్పు నియోజకవర్గ గొడిశాల కార్తీక్ గౌడ్, యూత్ నాయకులు ఆదిత్య చిన్నతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఆజాద్ హింద్ ఫౌజ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో 'నాకు రక్తాన్ని ఇవ్వండి.. మీకు స్వరాజ్యాన్ని ఇస్తాను' అనే నినాదంతో యువతలో విప్లవ సెగలు రగిలించిన మహానేత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 130వ జయంతి ఉత్సవాలు వరంగల్‌లో మిన్నంటాయి. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, స్టూడెంట్స్ బ్లాక్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్, స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ హాజరై, నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఐసీఎస్ వంటి అత్యున్నత ఉద్యోగం లభించినప్పటికీ, బ్రిటీష్ వారికి సేవ చేయడం ఇష్టం లేక ఆ పదవిని తృణప్రాయంగా వదిలేసి దేశ విముక్తికై పోరాడారని గుర్తుచేశారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టి, ఆజాద్ హింద్ ఫౌజ్‌ను నిర్మించి ఆంగ్లేయుల వెన్నులో వణుకు పుట్టించిన ఏకైక నాయకుడు నేతాజీ అని కొనియాడారు. నేతాజీ కలలుగన్న సమసమాజ నిర్మాణం కోసం, కులమతాలకు అతీతంగా గత 87 ఏళ్లుగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. దేశాన్ని బలోపేతం చేసేందుకు, సమానత్వ హక్కుల సాధన కోసం విద్యార్థులు, యువకులు, మహిళలు మరియు కార్మికులు నేతాజీ ఆశయాలతో నడవాలని పిలుపునిచ్చారు. దేశ సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరి పటిష్టమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. ఈ జయంతి వేడుకల్లో స్టూడెంట్స్ బ్లాక్ నాయకులు, విద్యార్థులు, యువకులు, నేతాజీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేతాజీ మార్గం.. దేశానికి ఆదర్శం

## దేశభక్తుల వేషధారణలో విద్యార్థుల ర్యాలీ



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** భారత స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు హసన్‌పర్తిలో అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక నేతాజీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ దేశభక్తుల వేషధారణలతో గ్రామ పురవీధుల్లో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముందుగా నేతాజీ విగ్రహానికి ఆర్ఎస్ఎస్ ప్రచారకర్త అభినవ్ చాణిక్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ వలస జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన సభలో అభినవ్ చాణిక్య మాట్లాడుతూ.. నేతాజీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "నాకు రక్తాన్ని ఇవ్వండి.. మీకు స్వరాజ్యాన్ని ఇస్తాను" అన్న పిలుపుతో పాటు, నేడు మనం నిత్యం పలికే "జై హింద్" నినాదాన్ని భారతీయులకు అందించిన మహనీయుడు నేతాజీ అని పేర్కొన్నారు. చిన్నతనం నుండే నాయకత్వ లక్షణాలు కలిగిన నేతాజీ గురించి విద్యార్థులు చదివి, ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఇండియన్ నేషనల్ ఆర్మీ ద్వారా బ్రిటీష్ వారిని గడగడలాడించిన నేతాజీ చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. హసన్‌పర్తిలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన జి. నరసింహారావు దంపతులను ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. గుండమీది కృష్ణమోహన్, మేకల హరిశంకర్, కందుకూరి శ్రీకాంత్, పావుశెట్టి అభిలాష్, పొలపాక అభిలాష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు జి.పావని, ఎస్.రజిత, డి.సమలత, సీహెచ్.దివ్య, వి.రుచికల, మమత, లత, శిరీష, ప్రవళిక, పర్వీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశం కోసం ప్రాణాలర్పించిన ధీరుడు నేతాజీ

**వరంగల్ వాయిస్, జనగామ :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 130వ జయంతి ఉత్సవాలు జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్ ఈగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగం శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. "నాకు రక్తాన్ని ఇవ్వండి.. మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను" అన్న పిలుపుతో లక్షలాది మంది యువతలో దేశభక్తిని రగిలించిన మహనీయుడని ఆయన అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని సమర్ధవంతంగా నిలిపేందుకు ఆయన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారని, ఆయన ప్రాణత్యాగం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ బొమ్మిశెట్టి యాకయ్యతో పాటు అఖిలపక్ష నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హాజరైన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వెన్నం సత్య నిరంజన్ రెడ్డి, చింతకింది మల్లేష్, ఉడుత రవి యాదవ్, బిజ్జాల నవీన్ కుమార్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు పిట్టల సతీష్, బింగి వీరేందర్, కొయ్యడ శ్రీనివాస్, సీస శ్రీధర్, అనంతుల ఆంజనేయులు, రాజు, షకీల్, శివరాత్రి రవికుమార్, ఆకునూరు వెంకన్న, మురళీధర్, కొండా శ్రీనివాస్, ఏల సురేష్, చందుపట్ల రవీందర్ రెడ్డి, బోగ దయాకర్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని నేతాజీకి నివాళులర్పించారు.

# మతోన్మాదాన్ని తిప్పికొట్టండి.. రాజ్యాంగాన్ని రక్షించండి

**• మాజీ ఎంపీ సుభాషిణి అలీ**




**వరంగల్ వాయిస్, జనగామ :** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో హిందూ, ముస్లింలు భుజం భుజం కలిపి బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించారని, ఆ మహోజ్వల చరిత్రను నేడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు వక్రీకరిస్తున్నాయని మాజీ పార్లమెంట్ సభ్యురాలు సుభాషిణి అలీ ధ్వజమెత్తారు. శుక్రవారం జనగామ పట్టణంలోని గిర్నీగడ్డ ప్రాంతంలో 'ఆవాజ్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎండీ.అజారుద్దీన్ అధ్యక్షతన జరిగిన సభలో సుభాషిణి అలీ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. స్వాతంత్ర్య పోరాటంలో వేలాది మంది ముస్లిం యోధులు ప్రాణత్యాగం చేశారని, వారి దేశభక్తిని నేటి తరానికి తెలియకుండా కుట్రలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ఈ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆవాజ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. పోరాటాల పురిటిగడ్డ జనగామలో షేక్ బందగీ బలిదానంతోనే స్వాతంత్ర్య కాంక్ష రగిలిందని, అప్పట్లో దేశవ్యాప్తంగా ఇదే స్ఫూర్తితో పోరాటాలు సాగాయని గుర్తుచేశారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్ మాట్లాడుతూ.. బీజేపీ మనుషుల మధ్య మతం పేరుతో చీలికలు సృష్టించి పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని, దేశ సమైక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఏ. గయాస్, అబ్దుల్ సమద్, ఎండి. షబానా, ఇర్రి అహల్య, జోగు ప్రకాష్, ఎండీ.దస్తగీర్, బొట్ల శేఖర్, బోడ నరేందర్, కుమారి సుమ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుండి ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు.

# నర్సమ్మ చిత్రపటానికి శ్రీనివాస్ రెడ్డి నివాళి



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేదావత్ విజయ్ తల్లి దేదావత్ నర్సమ్మ ఇటీవల మరణించారు. శుక్రవారం ఆమె దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించగా, రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ జిల్లా నాయకులు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించిన అనంతరం, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, గజావెల్లి ప్రసాద్, ఐత రామ్ చందర్, ఐత రవి పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షులు జగన్, పార్టీ ముఖ్య నాయకులు మేగ్య నాయక్, ఉపేందర్, హరి, ఇతర కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.

# క్యాంటీన్ నిర్వాహకురాలికి సన్మానం



**వరంగల్ వాయిస్, రామన్నపేట :** తమదైన కృషితో వ్యాపార రంగంలో రాణిస్తున్న మహిళలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అరుదైన గుర్తింపు లభించింది. వరంగల్ కలెక్టరేట్ ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహిస్తున్న మట్టెవాడకు చెందిన మొగిలి శ్రీదేవికి ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హాజరుకావాల్సిందిగా ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఢిల్లీ పర్యటనకు సంబంధించి ఖర్చులను కూడా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భరించడం పట్ల ట్రస్ట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బ్యాంకు వారు అందిస్తున్న ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలు మహిళా సాధికారతకు దోహదపడతాయని, శ్రీదేవిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది మహిళలు వ్యాపార రంగంలోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్, ఆర్గనైజర్ శ్రవణ్, సభ్యులు శైలజ, ఆడెపు రవివర్మ, డోలి ఎల్లయ్య పాల్గొన్నారు. వీరితో పాటు లోక్ సత్తా నగర కార్యదర్శి ఇనుముల రమేష్, కట్టమల్లు, హరీష్, శ్రీదేవి కుటుంబ సభ్యులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# మొబైల్ రహిత జీవనంపై వ్యాసరచన పోటీలు




**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ల అతి వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇన్నర్ వీల్ క్లబ్ వరంగల్ ప్రతినిధులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. చార్ బౌళిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో "మొబైల్ లేని రోజు" అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొబైల్ ఫోన్లు లేకపోతే జీవితం ఎంత ప్రశాంతంగా ఉంటుందో వివరిస్తూ తమ ఆలోచనలను వ్యాస రూపంలో అద్భుతంగా వ్యక్తపరిచారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు మర్రి రేణుక షీల్డ్, నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతికతకు బానిసలు కాకుండా, పుస్తక పఠనం, శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అలాగే ఇన్నర్ వీల్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ ఎన్.లావణ్య, ఐఎస్ఓ రవళి, నాగరాణి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# చేనేత కార్మికుల రుణమాఫీ హర్షణీయం



**వరంగల్ వాయిస్,శాయంపేట :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మినిమం వేజ్ బోర్డు మెంబర్, మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్ కొనియాడారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అమలు కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత శాఖ ఏడీ విజయలక్ష్మి రూ.9 లక్షల రుణమాఫీ చెక్కును అందజేసినట్లు ఆయన వెల్లడించారు. కష్టాల్లో ఉన్న చేనేత కార్మికులను ఆదుకునేందుకు రుణమాఫీ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, అలాగే ఇందుకు ప్రత్యేకంగా కృషి చేసిన స్థానిక భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు ఈ సందర్భంగా చంద్రప్రకాష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సీఐ నవీన్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** కమలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా నూతనంగా నియమితులైన పి.నవీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అదేవిధంగా, ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అధికారులను అభినందించారు. ఏసీపీ సమక్షంలో నూతన సీఐ నవీన్, బదిలీపై వెళ్తున్న హరికృష్ణలను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, నేతలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ తడుక శ్రీకాంత్, విష్ణుదాసు వంశీధర్ రావు, మార్కెట్ డైరెక్టర్ సముద్రాల కృష్ణ, నల్లాని సురేష్, పల్లె సంతోష్, తక్కల్లపల్లి అశోక్ రావు, వార్డు మెంబర్లు మౌటం రమేష్, గంధసిరి బిక్షపతి, చిరంజీవి తదితరులు పాల్గొని అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా వసంత పంచమి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని విశ్వ జెనిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వసంత పంచమి వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతి దేవి జయంతిని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎర్రబెల్లి హరికుమార్ ఆధ్వర్యంలో నూతనంగా పాఠశాలలో చేరుతున్న పలువురు చిన్నారులకు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతి మాతా చిత్రపటానికి పూలమాలలు వేసి, ధూపదీప నైవేద్యాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. జ్ఞానానికి అధిదేవత అయిన సరస్వతి దేవిని ఆరాధించడం వల్ల విద్యార్థులకు ఏకాగ్రత, విజ్ఞానం లభిస్తాయని పేర్కొన్నారు. చిన్నారుల విద్యాభ్యాసానికి వసంత పంచమి అత్యంత శుభప్రదమైన రోజని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం మరియు సిబ్బంది పాల్గొన్నారు. పూజ అనంతరం విద్యార్థులకు ప్రసాద వితరణ చేశారు.

# పల్లవి మోడల్ స్కూల్‌లో ఘనంగా వసంత పంచమి వేడుకలు



**వరంగల్ వాయిస్, అన్నారం :** అన్నారంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని 'అక్షరాభ్యాస మహోత్సవం' భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విద్యాదేవి సరస్వతి అమ్మవారి ఆశీస్సులతో చిన్నారుల విద్యా ప్రస్థానం ప్రారంభం కావాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రసిద్ధ పూజారి శ్రీ రామగిరి దామోదర చారి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య సరస్వతి పూజ శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల ఆవరణమంతా ఆధ్యాత్మిక శోభతో, పండుగ వాతావరణంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి, కరెస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విద్యా సంస్కృతితో పాటు భారతీయ సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. వసంత పంచమి శుభ సందర్భాన్ని పురస్కరించుకొని 2026–27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వారు వెల్లడించారు.

# ‘వరంగల్ వాయిస్’ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కేయూ వీసీ, రిజిస్ట్రార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో ‘వరంగల్ వాయిస్’ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ క్యాలెండర్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ వాయిస్ పత్రిక విద్యార్థుల సమస్యలను, విశ్వవిద్యాలయ అభివృద్ధిని ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకువస్తోందని అభినందించారు. రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న పత్రిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ‘వరంగల్ వాయిస్’ స్టాఫ్ రిపోర్టర్ బండారి సుమన్ పాల్గొన్నారు.

# ఓటు హక్కు.. ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష



**వరంగల్ వాయిస్, నడికూడ :** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నడికూడ మండల వ్యాప్తంగా శుక్రవారం చైతన్య కార్యక్రమాలు మిన్నంటాయి. మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది కలిసి ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, నిష్పక్షపాతంగా, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ పూనారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. “ఓటు మన హక్కు – మన బాధ్యత”, “ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి” అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు వీధుల్లో మారుమోగాయి. ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు తహసీల్దార్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది, మండల విద్యాశాఖ అధికారి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అక్షరాభ్యాసం



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వసంత పంచమి వేడుకలతో పాటు జాతీయ ఓటర్ దినోత్సవ అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని చదువుల తల్లి సరస్వతి దేవికి పాఠశాల ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా చేరుతున్న 15 మంది చిన్నారులకు ఉపాధ్యాయులు, పెద్దల సమక్షంలో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థుల విద్యాభ్యాసం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ‘ఓటు హక్కు – ప్రాముఖ్యత’ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంపీడీవో కల్పన, ఎంఈఓ లాకావత్ రాజేష్ కుమార్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మతోన్మాద పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టండి

◆ పోటు రంగారావు, గుమ్మడి నర్సయ్య

**వరంగల్ వాయిస, ఖమ్మం :** దేశంలో బీజేపీ ప్రభుత్వం, సంఘ్ పరివార్ శక్తులు అల్లుతున్న కుల మతోన్మాద ఫాసిస్ట్ పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టి, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థి, యువతపైనే ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభం సందర్భంగా జడ్పీ సెంటర్ నుంచి భక్త రామదాసు కళాక్షేత్రం వరకు భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు బిగిసిన పిడికిళ్లతో, ఎర్రజెండాలు చేతబట్టి “జీనా హైతో మర్ నా సిఖో – కదం ఫర్ లడ్ నా సికో” అంటూ చేసిన నినాదాలు ఖమ్మం పురవీధుల్లో మార్మోగాయి. అనంతరం పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటీ పృథ్వీ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య వక్తలుగా హాజరైన పోటు రంగారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే వారిని ‘అర్బన్ నక్సల్స్’ అని ముద్ర వేసి జైలు పాలు చేస్తున్నారని, ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలను బూటకపు ఎన్కౌంటర్లలో హత్య చేస్తున్నారని మండిపడ్డారు. నూతన విద్యా విధానం-2020 ద్వారా




విద్యా రంగాన్ని కాషాయీకరిస్తూ, భావి పౌరులను మతోన్మాదులుగా మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. 79 ఏళ్ల స్వాతంత్ర్య పాలనలో సామాన్యులకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల విప్లవ గేయాలు, కళారూపాలు విద్యార్థులలో పోరాట స్ఫూర్తిని రగిలించాయి. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్ కుమార్, అనిల్ సాయిబోలా మరియు రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రగతిశీల సమాజ స్థాపనకు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సంఘటితంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు చట్టరీత్యా నేరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి యాజమాన్యంపై ఉందని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హన్మకొండలోని స్వధార్ మహిళా ఆశ్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ‘పోష్ యాక్ట్-2013’ (కార్యస్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం) పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 10 మంది కంటే ఎక్కువ మంది సిబ్బంది ఉన్న ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలో 50 శాతం మహిళలు ఉండాలని, మహిళా అధ్యక్షురాలితో పాటు ఒక బయటి నిపుణుడిని (ఎక్స్టర్నల్ మెంబర్) నియమించాలని సూచించారు. వేధింపులపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని అత్యంత గోప్యంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. “మహిళలు భయాన్ని వీడి తమకు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే స్థాయికి ఎదగాలి. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే తమను తాము రక్షించుకోగలరు. మహిళలను వేధిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని డాక్టర్ అనితా రెడ్డి హెచ్చరించారు. కార్యాలయాల్లో పోష్ యాక్ట్‌పై పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించాలని, తరచూ శిక్షణా సదస్సులు నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు. మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేసే వాతావరణం కల్పించడమే ఈ చట్టం యొక్క అసలు లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్వధార్ నిర్వాహకులు శైలజ, సంధ్య, ఆశ్రమ మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటుపై చైతన్యం.. పోటీల్లో విద్యార్థుల ఉత్సాహం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్వతగిరి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఏ.భిక్షపతి వెల్లడించారు. విజేతలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రథమ స్థానం ఏ.గౌతిక (9వ తరగతి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల), ద్వితీయ స్థానం పీ.స్నికిత (9వ తరగతి, ఆర్డీఎఫ్ కల్లెడ పాఠశాల), వకృత్వ (ఉపన్యాస) పోటీల్లో ప్రథమ స్థానం బి.హారిక (10వ తరగతి, పర్వతగిరి ఉన్నత పాఠశాల), ద్వితీయ స్థానం ఆర్.సహస్ర (9వ తరగతి, ఆర్డీఎఫ్ కల్లెడ పాఠశాల)లు నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఎన్నికల ప్రక్రియ, ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లలితాదేవి, సీఆర్‌పీలు శ్రీనివాస్, ప్రవీణ్, ఎంఆర్‌సీ సిబ్బంది జయరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.


# విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర కీలకం

• ప్రిన్సిపాల్ కె సంపత్ కుమార్

**వరంగల్ వాయిస్, పరకాల :** విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అధ్యాపకుల బోధన ఎంత అవసరమో, తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా అంతే కీలకమని పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్ కుమార్ అన్నారు. ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు శుక్రవారం కళాశాల ఆవరణలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల దృష్ట్యా, విద్యార్థులు ఇంటి వద్ద చదివే సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ఇక్కడ అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన సాగుతోందని, ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో విశాలమైన తరగతి గదులు, ఆటస్థలంతో పాటు ఈ ఏడాది కొత్తగా డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఇక్కడ చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల ఫోటోలను స్ఫూర్తి





కోసం బ్యానర్ల రూపంలో ప్రదర్శించామన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను పంచుకుంటూ.. ఇలాంటి సమావేశాల వల్ల తమ పిల్లల హాజరు, పరీక్షల్లో వారి పురోగతి గురించి తెలుసుకునే అవకాశం కలుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో మారుతున్న విద్యా విధానం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ‘అమ్మ ఆదర్శ కమిటీ’ చైర్మన్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 37 ఏళ్ల తరవాత రజనీ హిందీ మూవీ విడుదల

### ఏఐ సాయంతో కొత్త హంగులతో విడుదలకు సిద్ధం

సాధారణంగా ఒక సినిమా ఆలస్యం అయితే కొన్ని నెలలు లేదా గరిష్ఠంగా రెండు మూడు సంవత్సరాల వరకే ఉంటుంది. కానీ తాజాగా ఓ సినిమా ఏకంగా 37 ఏళ్ల తర్వాత విడుదలకు సిద్ధమవుతుండటం సినీ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఆ సినిమా మరేదో కాదు.. సూపర్ స్టార్ రజనీకాంత్, బాలీవుడ్ దిగ్గజ నటుడు శత్రుఘ్న సిన్హా హీరోలుగా నటించిన హిందీ చిత్రం 'హమ్ మే షాహెన్ షా కౌన'. 1989లో తెరకెక్కిన ఈ చిత్రంలో హేమా మాలిని కీలక పాత్రలో నటించారు. అప్పట్లో ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని, త్వరలోనే విడుదల చేస్తామని నిర్మాతలు అధికారికంగా ప్రకటించడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇద్దరు పెద్ద స్టార్స్ కలిసి నటించిన సినిమా కావడంతో, తమిళంలో డబ్బింగ్ చేసి విడుదల చేయాలన్న ఆలోచన కూడా మేకర్స్‌లో ఉన్నట్లు సమాచారం. అయితే నిర్మాణానంతర పనులు చివరి దశలో ఉన్న సమయంలో అనూహ్యంగా ఈ ప్రాజెక్ట్ నిలిచిపోయింది. కారణాలు మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. ఆ తర్వాత ఈ సినిమాను మళ్లీ విడుదల చేసే ప్రయత్నాలు పలు సార్లు జరిగినా, అవన్నీ విఫలమయ్యాయి. ఇలాంటి తరుణంలో అనూహ్యంగా ఈ సినిమా విడుదలపై వార్తలు రావడం ఇప్పుడు బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినీ పరిశ్రమలోనూ చర్చనీయాంశంగా మారింది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. రీల్ ఫార్మాట్‌లో ఉన్న సినిమాను ఇప్పటికే డిజిటల్ ఫార్మాట్‌గా మార్చారని తెలుస్తోంది. అంతేకాదు, సౌండ్ క్వాలిటీ, విజువల్స్ మెరుగుపరచడంతో పాటు, హీరోల పాత్రలను మరింత ఆకర్షణీయంగా చూపించేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు సమాచారం. 37 ఏళ్ల క్రితం షూటింగ్ పూర్తయిన ఈ సినిమా చివరకు 2026 ఏప్రిల్‌లో విడుదల అవుతుందని నిర్మాతలు ధీమాగా చెబుతున్నారు.




# మార్చికి మారిన స్వయంభు మూవీ

కార్తికేయ2తో పాన్ ఇండియా హీరోగా మారిపోయాడు నిఖిల్. కానీ ఆ తర్వాత వేసిన రాంగ్ స్టంప్స్ వల్ల ఇమేజ్ డ్యామేజ్ చేశాయి. 18 పేజెస్ పాజిటివ్ టాక్ తెచ్చుకున్నా పైసల్ రాలేదు. ఇక స్పై, అప్పుడో ఎప్పుడో ఇప్పుడో భారీ డిజాస్టర్స్‌గా నిలవడంతో స్లో అండ్ స్టడీగా మూవీస్ చేస్తున్నాడు. నెక్స్ట్ పీరియాడిక్ వార్ డ్రామా స్వయంభుతో గట్టిగా కొట్టాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ సినిమా కోసం గెటప్స్ ఛేంజ్ చేయడమే కాదు దాదాపు రెండేళ్లు ఈ సినిమాకే కమిటయాడు. స్వయంభు 170 రోజుల భారీ షెడ్యూల్ షూట్ కంప్లీట్ చేసుకుని ఈ మధ్యే గుమ్మడికాయ కొట్టేసింది టీం. ఈఏడాది ఫిబ్రవరి13న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ఎనౌన్స్ చేశారు. సంయుక్త వి□నన్, నభా నటేష్ హీరోయిన్స్. అయితే ఈ సినిమా రిలీజ్ కావడానికి సమయం దగ్గర పడుతున్నా టీం ప్రమోషన్స్ స్టార్ట్ చేయలేదు. జస్ట్ షూట్ కంప్లీటైన వీడియో తప్ప మరో అప్డేట్ లేదు. సంక్రాంతికి పోస్టర్స్ వేసినప్పటికీ.. రిలీజ్ డేట్ మాయం అయ్యింది. స్వయంభును అత్యంత భారీ బ్జడెట్ చిత్రంగా నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్. ఫిబ్రవరిలో స్వయంభు పోస్ట్ పోన్ అవడం పక్క.
అయితే నెక్స్ట్ ఏ డేట్ కు వస్తాడనే దానిపై రాకరకలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుతున్న సమాచారం ప్రకారం మార్చి 23 లేదా ఏప్రిల్ 30న రిలీజ్ చేసే ఛాన్సు ఉందని సమాచారం. అటు నిఖిల్ కూడా ఈ సినిమాపై ఎంతో నమ్మకంపెట్టుకున్నాడు. స్వయంభు కోసం చాలా కష్టపడి గుర్రపు స్వారీలు, కత్తి యుద్దలు వంటివి నేర్చుకున్నాడు. మరి నిఖిల్ కు స్వయంభు మరొక పాన్ ఇండియా హిట్ ఇస్తుందో లేదో చూడాలి.



# ఓ క్రైమ్ థ్రిల్లర్ మూవీ చీకటిలో..

థియేటర్‌లో వరుస సినిమాలు అలరిస్తున్నా.. కొన్ని చిత్రాలు ఇప్పటికీ నేరుగా ఓటీటీ వేదికల్లో విడుదలవుతూ ఆసక్తిని పెంచుతున్నాయి. శోభిత ధూళిపాళ్ల కీలక పాత్రలో రూపొందిన తాజా చిత్రం 'చీకటిలో..'. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా నేరుగా విడుదలైంది. నెల్లూరు సంధ్య (శోభిత ధూళిపాళ్ల) ఓ వార్తా ఛానల్‌లో యాంకర్. క్రైమ్ కథనాలను ప్రేక్షకులకు ప్రజెంట్ చేస్తూ ఉంటుంది. టీఆర్పీల కోసం కాకుండా వాస్తవాలను వెల్లడించాలన్నది ఆమె అభిమతం. అందుకు విరుద్ధంగా ఛానల్ వ్యవహరిస్తుండటం తో స్నేహితురాలు బాబీతో(అదితి) కలిసి సొంతంగా పాడ్‌కాస్ట్ ఛానల్ పెట్టాలని నిర్ణయించుకుంటుంది. అదే సమయంలో అమర్‌తో (విశ్వదేవ్ రాచకొండ) ప్రేమలో ఉంటుంది. ఇరు కుటుంబాలు పెళ్లి అంగీకరించిన ఆనందంలో ఉండగా.. బాబీ, అతని బాయ్ ఫ్రెండ్ దారుణంగా హత్యకు గురవుతారు. బాబీని అత్యాచారం చేసి చంపేస్తారు. ఆ హత్య చేసింది వాచ్‌మెన్ అని సంధ్య గుర్తించడంతో కేసు క్లోజ్ అయిపోతుంది. అప్పుడే సంధ్యకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వస్తుంది. తనని పట్టుకోలేక, ఓ అమాయకుడిని బలి పశువును చేశారంటూ అసలు హంతకుడు సంధ్యకు చెబుతాడు. దీంతో పోలీస్ ఆఫీసర్ రాజీవ్ (చైతన్య)తో కలిసి సంధ్య ఇన్వెస్టిగేషన్ మొదలు పెడుతుంది. అలా మొదలైన ఆమె ఇన్వెస్టిగేషన్ ప్రయాణం ఎన్ని మలుపులు తీసుకుంది? పాతికేళ్ల కిందట గోదావరి జిల్లాల్లో జరిగిన హత్యలతో ఈ హత్యకు ఉన్న సంబంధం ఏంటి? వీటి వెనుక ఎవరు ఉన్నారన్నది అసలు కథ. క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్లు తెలుగు ప్రేక్షకులకు కొత్తేమి కాదు. వాటిని ఎంత ఆసక్తికరంగా, ఉత్కంఠతో చూపించామన్న దానిపైనే సినిమా విజయం ఆధారపడి ఉంటుంది. 'చీకటిలో' మూవీ కోసం దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి ఎంచుకున్న కథా వస్తువుకు పాడ్ కాస్ట్ అనే పాయింట్ జోడించి చెప్పడం కొత్తగా ఉంది. అలాగే చివరి వరకూ హంతకుడు ఎవరో తెలియకుండా సన్నివేశాలను రాసుకున్న తీరూ అలరిస్తుంది. పాతికేళ్ల కిందటి హత్యాచార ఘటనతో కథను మొదలు పెట్టిన దర్శకుడు.. ఓ క్రైమ్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుడు చూడబోతున్నాడనే హింట్ ఇచ్చేశాడు. టీవీ యాంకర్ నెల్లూరు సంధ్య నేపథ్యం, కుటుంబం, అమర్‌తో ప్రేమ ఇలా ఆమె ప్రపంచాన్ని పరిచయం చేస్తూ కాస్త నెమ్మదిగా కథలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఎప్పుడైతే సంధ్య స్నేహితురాలు బాబీ హత్య జరుగుతుందో.. అప్పుడే అసలు కథ మొదలవుతుంది. ఇదే తరహాలో మరో జంట హత్యకు గురవడంతో కథ, కథనాలు ఆసక్తికరంగా మారతాయి. స్పెషల్ ఆఫీసర్ ఆనందిని (ఇషా చావ్లా) రంగ ప్రవేశంతో కథలో వేగం పెరుగుతుందని అనుకుంటే.. కొత్తదనమేమి ఉండదు. సంధ్య ఇన్వెస్టిగేషన్ చేస్తుంటే, ఉన్నతాధికారులు సైతం ఆమెను ఫాలో అవ్వడం ఏమంత ఆసక్తికరంగా అనిపించదు. పైగా పోలీసులు పెట్టిన హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి 'మరో హత్య చేసే లోపు నన్ను పట్టుకోండి' అంటూ హంతకుడే సవాల్ విసరడం కాస్త హాస్యాస్పదంగా ఉంటుంది. నెల్లూరు సంధ్య పాత్రలో శోభిత ధూళిపాళ్ల న్యాయం చేశారు. చైతన్య, ఇషా చావ్లా, సురేశ్, రవీంద్ర విజయ్, శ్రీనివాస్ వడ్లమాని తమ పాత్రల్లో ఒదిగిపోయారు. సాంకేతికంగా సినిమా బాగుంది. నిడివి కూడా తక్కువే. కథనం నెమ్మదిగా సాగినా.. కథను చివరి వరకూ ఆసక్తికరంగా చూపించడంలో శరణ్ కొప్పిశెట్టి విజయం సాధించారు.




# సునీతా విలియమ్స్‌ను కలిసిన ప్రకాశ్ రాజ్



కేరళలోని కోజికోడ్‌లో జరుగుతున్న సాహిత్య ఉత్సవం (ఒక అపురూప ఘట్టానికి వేదికైంది. భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను దిగ్గజ నటుడు ప్రకాశ్ రాజ్ ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా కలుసుకున్నాడు. ప్రస్తుతం కేరళలో లిటరేచర్ ఫెస్టివల్ జరుగుతుండగా.. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చింది సునీత విలియమ్స్. అయితే ఇటీవలే నాసా నుంచి పదవీ విరమణ పొంది భారత పర్యటనకు వచ్చిన సునీతా విలియమ్స్‌తో గడిపిన క్షణాలను ప్రకాశ్ రాజ్ తన సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ జనరేషన్ అత్యంత ధైర్యవంతురాలైన మహిళను కలవడం తనకు దక్కిన గొప్ప గౌరవమని, ఈ జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని ప్రకాశ్‌రాజ్ ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు వైరల్‌గా మారాయి.

# మేడారం జాతరను విజయవంతం చేద్దాం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- పోలీస్, ఆర్టీసీ అధికారులతో సమీక్ష
- పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి

**వరంగల్ వాయిస్, క్రైమ్ :** త్వరలో ప్రారంభం కానున్న ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా 'మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర' కోసం పోలీస్, ఆర్టీసీ శాఖలు సంయుక్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాను, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గత జాతరలో ట్రాఫిక్ జామ్ అయిన ప్రాంతాలను గుర్తించి, ఈసారి అలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. బస్సులు మేడారం వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడా నిలపకూడదని, కేవలం మేడారం బస్టాండ్‌లోనే ఆగాలని స్పష్టం చేశారు. బస్సులు రోడ్ల ఇరువైపులా నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతాయని, బ్రేక్ డౌన్ అయిన బస్సులను తక్షణమే తొలగించేందుకు టెక్నీషియన్లు, క్రేన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. గతంలో సమస్యలు సృష్టించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవద్దని, విధుల్లో ఉన్న డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బస్సులు ఎక్కడా ఆగవు కాబట్టి, భక్తులు తమకు కావలసిన తినుబండారాలను వెంట తెచ్చుకోవాలని మరియు కాలకృత్యాలను బస్టాండ్‌లోనే తీర్చుకోవాలని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగితే బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, దార కవిత, అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు సత్యనారాయణ, జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు పాల్గొన్నారు. ఆర్టీసీ తరఫున డిప్యూటీ ఆర్ఎంలు భాను కిరణ్, మహేష్, డిపో మేనేజర్లు రవి చందర్, అర్పిత, ధర్మాసింగ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సీతా రెడ్డి, వెంకన్న, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## జనగామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర మంత్రి సీతక్క
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం ఆమె జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి పట్టణ పరిధిలో కోట్లాది రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. జనగామ బైపాస్ రోడ్డు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన ఫౌంటెన్ శిల్పాలను, అలాగే బస్టాండ్ చౌరస్తా జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సూర్య నమస్కారాల శిల్పాలను మంత్రి ఆవిష్కరించారు. పట్టణంలోని బతుకమ్మ కుంటలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆమె పరిశీలించి, ప్రారంభించారు. మరమ్మతులు, పునరుద్ధరణ పనులు పూర్తి చేసుకున్న ఆర్ అండ్ బీ బంగ్లాను మంత్రి ప్రారంభించారు. అనంతరం పట్టణ ప్రజల సౌకర్యార్థం నిర్మించిన నూతన వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ఆవిష్కరించి, అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణ ప్రగతిలో ఈ పనులు మైలురాయిగా నిలుస్తాయని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డీవో గోపి రాం, జడ్పీ సీఈఓ మాధురి షా, మున్సిపల్ అధికారులు, ఆర్ అండ్ బీ ఇంజినీరింగ్ అధికారులు, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేడారం ఎగ్జిట్ మార్గాల్లో భద్రత పకడ్బందీ

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- రహదారుల పరిశీలన
- ఇండికేషన్ బోర్డుల ఏర్పాటు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పకడ్బందీ భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం ఆయన నార్లాపూర్ నుంచి భూపాలపల్లి వరకు, అలాగే నార్లాపూర్ నుంచి కాల్వపెల్లి మీదుగా కాటారం వరకు ఉన్న ఎగ్జిట్ (తిరుగు ప్రయాణ) మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జాతర ముగించుకుని తిరిగి వెళ్లే వాహనాల కోసం రహదారి పరిస్థితులను మెరుగుపరిచామని తెలిపారు. నార్లాపూర్ నుంచి భూపాలపల్లి వచ్చే మార్గంలో మూల మలుపులు అధికంగా ఉన్నాయని, వాహనదారులు వేగాన్ని నియంత్రించి జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు.

డ్రైవర్లను అప్రమత్తం చేసేందుకు కీలక ప్రాంతాల్లో ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జాతర సమయంలో పశువులు రోడ్లపైకి రావడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గ్రామస్థులు తమ పశువులను రోడ్ల మీదకు రాకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జాతర విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెస్ సౌకర్యాలు, వసతి ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. భద్రతతో పాటు సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడవద్దని సూచించారు. ప్రమాదాల నివారణకు భక్తులు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ సిబ్బందికి సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ పర్యటనలో ఎస్పీ వెంట ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



## 'సమ్మక్క సారలమ్మ' పద్యనాటక పోస్టర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆదివాసీల ఆరాధ్య దైవాలు సమ్మక్క–సారలమ్మలు అన్యాయాన్ని ఎదిరించిన ఆత్మగౌరవ ప్రతీకలని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న కొనియాడారు. హంటర్ రోడ్డులోని పీఠం ఆవరణలో శుక్రవారం ఆయన.. వరంగల్ తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ వారు ప్రదర్శించనున్న 'సమ్మక్క సారలమ్మ' చారిత్రాత్మక పద్యనాటక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. పీఠం ఆధ్వర్యంలో జానపద, గిరిజన సంస్కృతులపై అనేక పరిశోధనలు జరిగాయని గుర్తుచేశారు. 2008లోనే మేడారం జాతరపై సమగ్ర పరిశోధన గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం వెలువరించిందని తెలిపారు. నాటకాల ద్వారా చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని, ఇలాంటి మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ నెల 29న హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఈ పద్యనాటక ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసాని సురేష్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ ఆమేర్ అలీఖాన్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తకొండ వీరభద్రుడికి భారీ ఆదాయం

### హుండీ ద్వారా రూ.26.78 లక్షలు

**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు తమ మొక్కులను భారీగా సమర్పించుకున్నారు. శుక్రవారం దేవాదాయ ధర్మదాయ శాఖ పరిశీలకులు జి. సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ హుండీలను విప్పి ఆదాయాన్ని లెక్కించారు. హుండీ లెక్కింపులో మొత్తం రూ. 26,78,181 (ఇరవై ఆరు లక్షల డెబ్బై ఎనిమిది వేల నూట ఎనభై ఒక్క రూపాయలు) ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. నోట్ల రూపంలో రూ. 24,74,476/, నాణేల రూపంలో రూ.2,03,705/లు వచ్చాయి. ఈ మొత్తాన్ని వెంటనే స్థానిక యూనియన్ బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు ప్రక్రియలో హనుమకొండకు చెందిన శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు, కొత్తకొండ శ్రీ సరస్వతి సేవా సమితి సభ్యులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. అత్యంత పారదర్శకంగా, నిఘా నీడలో ఈ లెక్కింపు కార్యక్రమం పూర్తి చేశారు.





## ఓటు హక్కు ఆయుధం

- జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- అధికారులచే ప్రతిజ్ఞ

**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని బాధ్యతాయుతంగా వినియోగించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో, ఉద్యోగులతో కలిసి ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా ప్రతి పౌరుడు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో నిజాయితీ, పారదర్శకతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, కుల మతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం.సంపత్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com